అనుకున్న తేదీకే 'కల్కి'

తప్పుడు వార్తలను సృష్టించడమే కొందరి జీవన విధానం. రేటింగుల కోసం వాస్తవాలను మరుగున పరచడమే వీరి వృత్తి. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమా తాజాగా వీరి బారిన పడింది. ఈ సినిమాను మే 9న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. 'కల్కి 2898 ఏడీ' అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న సోషియో ఫాంటసీ ఫిక్షన్ మూవీ కావడం, ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొణే, దిశా పటానీ, పశుపతి లాంటి సూపర్‌స్టార్స్ ఇందులో నటిస్తుండటం.. పైగా నీజీ వర్క్‌తో కూడిన సన్నివేశాలు ఎక్కువగా ఉండటం.. ఈ కారణాలవల్ల విడుదలకు ఇంకాస్త జాప్యం జరిగే అవకాశాలున్నాయనేది ఈ వార్తల సారాంశం. ఈ నేపథ్యంలో ఈ రూమర్లపై చిత్రబృందం స్పందించింది. ప్రభాస్‌కి సంబంధించిన 'జస్ట్ ది వార్మ్ అప్' క్యాప్షన్‌తో వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో ద్వారా మే 9నే 'కల్కి 2898 ఏడీ' విడుదల కానుందని మేకర్స్ తెలిపారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి మాటలు: సాయి మాధవ్ బుర్రా, సంగీతం: సంతోష్ నారాయణ.

శనివారం శత్రువుల వేట..

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. శనివారం నాని జన్మదినం సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. ఎస్.జె.సూర్య వాయిస్‌తో టీజర్ మొదలైంది. కోపాన్ని ఓ క్రమపద్ధతిలో వాడుకునే వ్యక్తిగా నాని పాత్రను పరిచయం చేశారు. 'నా పేరు సూర్య. కోపం చూపించడానికి ఒక్కరోజు చాలు' అంటూ నాని చెప్పిన డైలాగ్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. కేవలం శనివారాల్లో మాత్రమే తన శత్రువులను వేటాడే పాత్రలో నాని పవర్‌ఫుల్‌గా కనిపించారు. మాస్ లుక్‌లో ఆకట్టుకున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జె.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.

మూడుముళ్లు పడ్డాయి.. ఏడేడు జన్మలబంధం ఏడడుగులతో మొదలైంది.. ఆశిష్, అద్వైతలు దైవ సాక్షిగా ఒకటయ్యారు. అగ్ర నిర్మాత దిల్‌రాజు ఇంట పెళ్లి సందడి అంటే మామూలుగా ఉంటుందా..! తారల ఆగమనంతో హైదరాబాద్ ఎన్ కన్వెన్షన్ సెంటర్ పాలపుంతలా మారింది. శుక్రవారం జరిగిన దిల్ రాజు సోదరుడు శిరీష్ కుమారుడైన హీరో ఆశిష్ వివాహ రిసెప్షన్‌కి పలువురు సినీ ప్రముఖులు హాజరై కొత్తజంటకు శుభాకాంక్షలు అందించారు. ఆ ఫొటోలు ఇవి.

ఆశిష్-అద్వైతలకు శుభాశీస్సులు అందిస్తున్న అక్కినేని నాగార్జున, నాగచైతన్య

ఆశిష్-అద్వైతలతో రామ్‌చరణ్

కొత్త జంటతో విజయ్ దేవరకొండ

కష్టాల్లో..

- భారత్ తొలి ఇన్నింగ్స్ 219/7
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 353

పగుళ్లు తేలిన పిచ్‌పై బ్యాటింగ్ చేయడానికి ఇబ్బంది పడ్డ టీమ్‌ఇండియా.. ప్రత్యర్థికి పైచేయి సాధించే అవకాశం ఇచ్చింది. సహచరులు విఫలమైన చోట ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ రూట్ అజేయ సెంచరీతో జట్టుకు మంచి స్కోరు సాధించిపెట్టగా.. అలాంటి పోరాటం మన టీమ్‌లో కరువైంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ అర్ధశతకంతో రాణించినా.. తక్కినవాళ్లు విఫలమవడంతో.. రాంచీ టెస్టులో రోహిత్ సేన కష్టాల్లో పడింది. మిగిలిన మూడు వికెట్లతో మనవాళ్లు మరెన్ని పరుగులు జోడిస్తారో చూడాలి!

రాంచీ: యువ ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ (4/84) ధాటికి భారత బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో టీమ్‌ఇండియా కష్టాల్లో పడింది. శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి రోహిత్ సేన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (73; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకంతో రాణించగా.. శుభ్‌మన గిల్ (38), ధ్రువ్ జురెల్ (30 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (2), రజత్ పాటిదార్ (17), రవీంద్ర జడేజా (12), సర్ఫరాజ్ ఖాన్ (14), రవిచంద్రన అశ్విన్ (1) విఫలమయ్యారు. ప్రస్తుతం చేతిలో మూడు వికెట్లు ఉన్న భారత్.. ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 134 పరుగులు వెనుకబడి ఉంది. జురెల్‌తో పాటు కుల్దీప్ (72 బంతుల్లో 17 బ్యాటింగ్, ఒక ఫోర్) క్రీజులో ఉన్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో హార్ట్‌లీ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 302/7తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ చివరకు 353 పరుగులకు ఆలౌటైంది. మాజీ కెప్టెన్ జో రూట్ (122 నాటౌట్) అజేయ శతకం బాదగా.. ఓలీ రాబిన్‌సన్ (58; 9 ఫోర్లు, ఒక సిక్సర్) వేగంగా పరుగులు రాబట్టాడు. చివరి మూడు వికెట్లు రవీంద్ర జడేజా ఖాతాలోకి వెళ్లాయి.

గత టెస్టులో అంపైర్స్ కాల్ వల్ల నష్టపోయామని చెప్పిన ఇంగ్లండ్ సారథికి.. రాంచీ మ్యాచ్‌లో అదే వరమైంది. టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు అంపైర్స్ కాల్ వల్ల పెవిలియన్ చేరారు.

యశస్వి (73)

యశస్వి @ 5

ఈ సిరీస్‌లో పరుగుల వరద పారిస్తున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్.. ఒకే సిరీస్‌లో 600 పరుగులు చేసిన ఐదో భారత బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. టీమ్‌ఇండియా తరపున గతంలోసునీల్ గవాస్కర్, విరాట్ కోహ్లీ, రాహుల్ ద్రవిడ్, దిలీప్ సర్దేశాయ్ మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇందులో సన్నీ, కోహ్లీ, ద్రవిడ్ రెండేసి సార్లు ఈ ఫీట్ సాధించారు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353 (రూట్ 122 నాటౌట్, రాబిన్‌సన్ 58; జడేజా 4/67, ఆకాశ్‌దీప్ 3/83), భారత్ తొలి ఇన్నింగ్స్: 219/7 (యశస్వి 73, గిల్ 38; బషీర్ 4/84, హార్ట్‌లీ 2/47).

హైదరాబాద్‌లో పీకేఎల్ ప్లే ఆఫ్ మ్యాచ్‌లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. పన్నెండు వారాల హోరాహోరీ పోటీల తర్వాత లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన ఆరు జట్లు సోమవారం నుంచి ప్లే ఆఫ్స్‌లో తలపడనున్నాయి. గచ్చిబౌలిలో జరిగే రెండు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో దబాంగ్ ఢిల్లీతో పట్నా పైరేట్స్.. గుజరాత్ జెయింట్స్‌తో హర్యానా స్టీలర్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ప్లే ఆఫ్స్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి శనివారం వెల్లడించారు.

శభాష్ శోభన

యూపీపై బెంగళూరు విజయం

డబ్ల్యూపీఎల్ రెండో సీజన్

శోభన (5/22)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో బెంగళూరు బోణీ కొట్టింది. శనివారం హోరాహోరీగా సాగిన పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 2 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై విజయం సాధించింది. మొదట బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. సబ్బినేని మేఘన (53; 7 ఫోర్లు, ఒక సిక్సర్), రిచ ఘోష్ (62; 12 ఫోర్లు) అర్ధశతకాలు సాధించారు. అనంతరం లక్ష్యఛేదనలో యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 155 రన్స్ చేసింది. గ్రేస్ హారీస్ (38), శ్వేత షెరావత్ (31) పోరాడినా ఫలితం లేకపోయింది. బెంగళూరు బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' శోభన ఆశ 5 వికెట్లతో అదరగొట్టింది. లీగ్‌లో భాగంగా ఆదివారం గుజరాత్‌తో ముంబై తలపడనుంది.

ముషీర్ డబుల్

ముంబై: టీమ్‌ఇండియా ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడు, అండర్-19 ప్రపంచకప్ హీరో ముషీర్ ఖాన్.. రంజీట్రోఫీలోనూ అదరగొడుతున్నాడు. బరోడాతో జరుగుతున్న రంజీ క్వార్టర్ ఫైనల్లో ముషీర్ (357 బంతుల్లో 203 నాటౌట్; 18 ఫోర్లు) అజేయ ద్విశతకంతో చెలరేగడంతో ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులు చేసింది. కెప్టెన్ రహానే (3), పృథ్వీ షా (33) విఫలమైన చోట ముషీర్ డబుల్ సెంచరీతో సత్తాచాటాడు. బరోడా బౌలర్లలో భార్గవ్ భట్ 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బరోడా.. 2 వికెట్లకు 127 పరుగులు చేసింది.

భారత్ తీన్‌మార్

బాగ్దాద్: ఆసియాకప్ ఆర్చరీలో భారత విలువిద్యాకారులు సత్తాచాటుతున్నారు. లెగ్-1లో భాగంగా జరుగుతున్న పోటీల్లో శనివారం మన ఆర్చర్లు మూడు స్వర్ణాలు సహా నాలుగు పతకాలు ఖాతాలో వేసుకున్నారు. వ్యక్తిగత విభాగాల్లో మరో 10 పతకాలను ఖాయం చేసుకున్నారు. పురుషుల, మహిళల, మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ విభాగాల్లో భారత్‌కు పసిడి పతకాలు దక్కాయి. మూడు విభాగాల్లోనూ ఇరాన్‌తోనే జరిగిన ఫైనల్స్‌లో మన వాళ్లు అదరగొట్టారు.

నాగల్‌కు వైల్డ్‌కార్డ్

దుబాయ్: భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్‌కు దుబాయ్ చాంపియన్‌షిప్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. శనివారం ప్రారంభమైన ఏటీపీ 500 ఈవెంట్‌లో నాగల్ మెయిన్ డ్రాకు చేరాడు. ఈ సీజన్‌లో అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న నాగల్.. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 49వ ర్యాంకర్ లొరెన్జో (ఇటలీ)తో తలపడనున్నాడు.

'భీమా' దుష్టశిక్షణ

హర్ష, ప్రియాభవానీ, గోపీచంద్, మాళవిక శర్మ, నరేష్, రాధామోహన్

'దర్శకుడు హర్ష ఈ కథను ఎంత బాగా చెప్పాడో అంతే బాగా తెరకెక్కించాడు. ఈ సినిమా కోసం టెక్నీషియన్స్ అందరూ అద్భుతంగా పనిచేశారు. మహాశివరాత్రి రోజున ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా ఏ.హర్ష దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భీమా'. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మించారు. మహాశివరాత్రి కానుకగా మార్చి 8న విడుదల కానుంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దుష్ట శిక్షణ కోసం ఎంతకైనా తెగించే పోలీస్ ఆఫీసర్ పాత్రలో గోపీచంద్ పాత్రను ప్రజెంట్ చేసిన విధానం ఆకట్టుకుంది. యాక్షన్, మాస్ అంశాలతో ట్రైలర్ మెప్పించింది. గోపీచంద్ మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కన్నడంలో ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఈ సినిమాతో తెలుగులో కూడా గుర్తింపు దక్కుతుంది. కథలోని ఫ్యామిలీ ఎలిమెంట్స్ అందరికీ కనెక్ట్ అవుతాయి' అన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించే చిత్రమిదని దర్శకుడు హర్ష తెలిపారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'బహుముఖం'

స్వీయ దర్శకనిర్మాణంలో హర్షివ్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ అండ్ ది యాక్టర్' ఉపశీర్షిక. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన ఈ సినిమా ట్రైలర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క ఆవిష్కరించారు. కౌన్సిలింగ్ సెషన్‌లో భాగంగా హీరో సైకో థెరపిస్ట్ దిశను కలవడం, తన కలను నెరవేర్చుకోవడానికి ఆమె సహాయాన్ని కోరడం, తన చుట్టూ వున్న వ్యక్తుల తాలూకు కొన్ని సీక్రెట్స్ తనకు తెలుసునని చెప్పడం ట్రైలర్‌లో ఆసక్తిని పెంచింది. హీరో, దర్శకుడు హర్షివ్ కార్తిక్ మాట్లాడుతూ 'ఆమెరికాలో తీసిన పక్కా తెలుగు సినిమా ఇది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఆనూహ్య మలుపులతో సాగుతుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ల్యూక్ ఫ్లెచర్, సంగీతం: ఫణి కల్యాణ్, రచన, నిర్మాణం, దర్శకత్వం: హర్షివ్ కార్తీక్.

హాలీవుడ్ సినిమాల ప్రేరణతో 'చారి 111'

'నా కెరీర్ ఎడిటర్‌గా మొదలైంది. కొన్ని యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను కూడా. 'మళ్లీ మొదలైంది'తో దర్శకుడ్ని కావడం అనుకోకుండా జరిగిపోయింది' అని తెలిపారు దర్శకుడు కీర్తి కుమార్. కామెడీ ప్రధానంగా ఆయన తీసిన తాజా సినిమా 'చారి 111'. వెన్నెల కిశోర్ టైటిల్‌రోల్ చేశారు. అదితి సోని నిర్మాత. మార్చి 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరులతో ముచ్చటించారు కీర్తికుమార్. 'మళ్లీ మొదలైంది' షూటింగ్ టైమ్‌లోనే ఈ ఐడియా వెన్నెల కిశోర్‌కి చెప్పాను. ఆయన స్క్రిప్ట్ సెండ్ చెయ్యమన్నారు. చదివి ఓకే చెప్పారు. పింక్ పాంథర్, జానీ ఇంగ్లీష్ వంటి హాలీవుడ్ సినిమాలు ఈ కథకు ప్రేరణ. 'జానీ ఇంగ్లీష్' సినిమా చూసినప్పుడు దర్శకుడ్ని అయితే, ఇటువంటి కథతో వెన్నెల కిశోర్‌తో సినిమా చేయాలని అప్పుడే అనుకున్నాను. ఆ కోరిక ఇలా నెరవేరింది' అని చెప్పారు కీర్తికుమార్.

Deltasoft Solutions Inc
An ERP Solutions Provider...
Deltasoft Solutions is specialized in Consulting services and solutions, Data Science, Machine Learning, ERP solutions, EPIC Electronic Medical Records Suite, application development tools for multiple industry domains.
Deltasoft Solutions is constantly looking for the best talent in the industry. We have the following
• Data Science with extensive Python and R experience.
• Cloud Architects
• Web Content Developers with Education content development experience.
You May Send your resume to hr@deltasoftgroup.com

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.